| శ్రీ రమణ జ్యోతి | Sri Ramana Jyothi |
|---|---|
| మే 2020 | May 2020 |

ఈ సంచికలో ... IN THIS ISSUE ...


1. డా॥ కే.యస్. గారి 70వ ప్రవచనం — డా॥ వి. రామదాస్ మూర్తి 3
2. శ్రీ భగవాన్ సేవలో — జి. శ్రీహరిరావు 9
3. అనుస్మరణీయులు — వీ. రమేష్ బాబు 15
4. శ్రీరమణమహర్షి భక్తాగ్రేసరులు — మల్లాది ఫణిమాల 22
5. Bhagavan's Compassion — Dr.K. Subrahmanian 30
6. Mani Mama as I knew Him — Vijayalakshmi Shyamkrishnan 35
7. Kavyakantha's Chatvarimsat — V. Krithivasan 38
8. An Interview with Sri N. Balarama Reddy Garu 41
9. Bhagavan Speaks to Us Like He Spoke to Them — Vimal Balasubrahmanyan 49


## Events in Sri Ramana Kendram in May 2020

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 26th May - Punarvasu Satsang - 6.00 - 7.30 p.m.
4. 9th May (Every 2nd Saturday of the month) Uma Sahasram recitation from 12.00 noon - 5.00 p.m.

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)

# సత్య పాలన

డా॥ కే.యస్. గారి 70వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

మనం వరుసగా సత్సంగాలలో పాల్గొంటుంటాము. ఫలానా వ్యక్తి యొక్క ప్రవచనం బాగుందని, బ్రహ్మాండంగా మాట్లాడాడని చర్చించుకుంటాము. మనం సంతోషంగా వుండాలన్న ఉద్దేశంతోనే ఇవన్నీ ప్రయత్నిస్తుంటాము. చాలా కాలంపాటు ఇలా గడిపిన తరువాత కూడ సంతోషం అబ్బలేదని విచారిస్తాము. అప్పుడు ఏదో పుస్తక పఠనం లేదా స్తోత్రం జపం చేయాలనుకుంటాము. ఈ రోజు నమ్మిన ఒక గురువును మార్చి మరొకరి దగ్గరికి వెళతాం. సంతోషం కోసం ఇలా అంతులేని ప్రయత్నాలు జరుగుతూనే ఉంటాయి. కాలం గడిచి పోతూనే ఉంటుంది. ఉపన్యాసాలను వినడం, పుస్తకాలను చదవడం వల్ల వుపయోగం లేదని తెలుసుకుందాం. రామాయణం, భాగవతం, భగవద్గీత మొదలైనవి విన్నప్పుడు అవి నీవు ఇలా ఉండాలి, ఇవి చేయాలి, నిస్సంగత్వం అలవాటు చేసుకోవాలి అని తెలియబరుస్తాయి. కాని ఇవేవీ చేయని కొందరుంటారు, వారు సంతోషంగా ఉంటారు. ఎందువల్ల? వ్యక్తి మతాచారాలను పాటించవచ్చు, గీతను పఠించవచ్చు, తత్త్వ శాస్త్రాన్ని అధ్యయనం చేసి వుండవచ్చు. అయినప్పటికీ అతనిలో ఆధ్యాత్మికత లోపించవచ్చు.

## ఆధ్యాత్మికత, ఆచారాల పాటింపు

ఆధ్యాత్మికత వేరు, మతపరమైన ఆచారాలను పాటించడం వేరు. మతాచారాలను పాటించని వాడు ఆధ్యాత్మికతను కలిగి

వుండవచ్చు. దీన్ని గురించి ఆలోచిస్తే, మనకు ఒక విషయం అర్థమౌతుంది. మనం ఎన్నో విషయాలను లోతుగా ఆలోచించ వలసిన పనిలేదు. చేయాల్సినది ఏమీ వుండదు. అందుకే మనం సత్-చిత్-ఆనందం అని అంటాము. 'సత్' అంటే ''ఏది ఉన్నదో అది''. 'అసత్' (అసత్యం) అంటే ''ఏది కాదో అది''. ఎవరైనా నేను మిగితావేవీ చేయను, నేను సత్యాన్ని మాత్రమే మాట్లాడతాను' అని అనుకుంటే, అతను దేవుని తలచుకోవలసిన అవసరం లేదు. పూజ, జపం, ధ్యానం చేస్తున్న పరిస్థితుల్లో వచ్చే సమస్య ఏమిటంటే మనం మన పట్ల, ఇతరుల పట్ల కూడ నీతిపరంగా, నిజస్థులుగా అన్ని సమయాల్లో వుండము. ఆ, ఫరవాలేదు, ఒకటి, రెండు అబద్ధాలు చెబితే ఏమీ కాదు అనుకుంటాం.

అందుకే మొదటిది, ముఖ్యమైనది 'సత్యం వద' సత్యాన్నే చెప్పడం. మిగితావన్నీ వాటంతట అవే అబ్బుతాయి. ఒక మనిషి పధ్నాలుగు ఏళ్ళ పాటు కేవలం సత్యాన్నే పలుక గలిగితే, అతను ఏమి మాట్లాడితే అది జరుగుతుంది, అని శ్రీరామకృష్ణ అనేవారు. కాని సత్యం పాటించని వ్యక్తులు కలవరపడి అలాంటి పొరపాట్లు చేసినప్పుడు భయపడి గుళ్ళకు వెళ్తారు. లేదా అబద్ధం చెబితే లాభం పొందవచ్చునన్న ఆ అభిప్రాయం కూడ ఉండవచ్చు. అలాగే ఏదో తాత్కాలిక లాభం కోసం కుటుంబ సభ్యులతో కూడ అబద్ధా లాడతాం. అది పెద్ద నష్టాన్నే కలిగిస్తుంది. పెద్దవాళ్ళైన తరువాత ఏదైనా అవకాశం వచ్చినప్పుడు తరువాతి రోజుల్లో తల్లిదండ్రులకు పాత సందర్భాలను గుర్తుచేసి, ఇలా చేస్తే ఏమవుతుందని ప్రశ్నిస్తారు.

గాంధీజీ 'సత్యమే దేవుడు, దేవుడంటే సత్యం' అనేవాడు. దేవుడి సంగతి మనకు తెలీదు, ఇతరులు చెప్పేదే మన

అభిప్రాయంగా భావిస్తాము. కాని సత్యం విషయానికి వస్తే అలా ఎవరి దగ్గరికి వెళ్ళక్కర లేదు. మనల్ని మోసం చేసుకొనగలం గాని ఇతరులను మోసం చేయలేము. మానవ లోపాలు తెలుసు గనుక మతపెద్దలు ఆధ్యాత్మికతకు మూలాధారం సత్యం ఒక్కటే అని చెబుతున్నారు. పూర్తి నిజాయితీగా ఉన్న వ్యక్తికి ఏ రకమైన భయమూ ఉండదు. అలా లేని వాళ్ళని ఎవరైనా అడిగితే, తాము నిజమే చెబుతున్నామంటారు. మనం అబద్ధం చెప్పడం లేదని ఇతరులను నమ్మించే ప్రయత్నం చేస్తుంటాం. సత్యానికి వాళ్ళు ఇచ్చే నివాళి ఇదన్న మాట. నిజాయితీ లేకుండ మతాచారాలను మాత్రం పాటించేవారు ఆధ్యాత్మికత లోపించిన వాళ్ళే అవుతారు.

మనస్యేకం, కచస్యేకం, కర్మణ్యేకం, మహాత్మనః అన్నది ఆర్యోక్తి. ఇది అతి సులభమైనది, అదే సమయంలో చాలా కష్టమైన పని కూడ. నిత్యజీవితంలో ఇతరుల నుండి ఏమైనా కోరుతున్నప్పుడు గాని ఇక ఇరకాటమైన సందర్భం నుండి బయట పడడానికి గాని అసత్యాన్ని చెప్పడం జరుగుతూనే వుంటుంది. అసత్యమాడిన ప్రతిసారి, క్షమించమని ప్రార్థించడం కూడ జరుగుతుంది. ఏమీ ఆశించనప్పుడు, ఏ భయమూ లేకుండ వుండవచ్చు. అది జ్ఞానుల విషయంలో సహజంగానే ఏర్పడుతుంది. సంపూర్ణమైన నిజాయితీ దేవుని కృప వున్నప్పుడే వీలవుతుంది. గాంధీజీకి అలా సంపూర్ణ నిజాయితీకి కట్టుబడడానికి చాలా శ్రమించాల్సి వచ్చింది. ఆయనకు దేవునిపై అమిత విశ్వాసం, మామూలు వ్యక్తులు కూడ ప్రయత్నిస్తే నిజాయితీగా బ్రతకగలరని ఋజువు అవుతుంది. ఈ విషయంలో దైవకృప అత్యవసరం. స్వయంగా గాంధీజీ ఈ మాటే చెప్పారు. ఈ ప్రపంచంలో కొందరు

దేవుడన్నవాడు వున్నాడో లేడో అని సందేహించేవాళ్ళు, నాస్తికులు కూడా ఆధ్యాత్మికతను కలిగి వుండవచ్చు. వాళ్ళ విషయంలో మనమేమీ చెప్పలేము. ప్రతిదానికీ మినహాయింపులు వుంటాయి.

## ఆశలే అడ్డు

ఆశలు, కోరికలు వున్నంత కాలం సత్యపాలనను గురించిన సమస్యలు వస్తూనే వుంటాయి. ప్రక్కరోజు నుంచి సత్యమే చెబుతానన్న నిశ్చయం తీసుకున్నప్పటికీ, సమస్య ఏదో రావచ్చు, పరిస్థితి పునరావృతం కావచ్చు. మన పూర్వీకులు అందుకే నీ సంగతి పూర్తిగా తెలుసుకోమనే వారు. భగవాన్ మొదలన నీవెవరో గ్రహించుకో అనేవారు. మహర్షి భక్తుడు పాల్‌బ్రంటన్, మనం ఎంతగా లౌకిక విషయాల్లో మునిగిపోయి వుంటామంటే, మన గురించి తెలుసుకునేందుకు క్షనకాలం కూడ సమయాన్ని కేటాయించ లేకపోతున్నామనేవారు. మన విషయం తెలుసుకుంటే, ఆశించడం, కోరడం అన్నవి తగ్గుతూ పోతాయి. అసలు ధ్యానం అంటే మనం మన గురించి ప్రత్యేకించి తెలుసుకునే ప్రయత్నానికి తోడ్పడేది. ఈ విషయం అర్థం అయ్యేకొద్దీ మన నిజాయితీ ఎక్కువవుతుంది. ఆ స్థితిలో ఏ కోర్కెలు గాని అసలు అన్వేషించే వాడు గాని వుండడని ఆదిశంకరులు అనేవారు. వ్యక్తి తనలో యితరులను, యితరులలో తనను గ్రహించేవారు.

గౌతమ బుద్ధుడు దేవుని గురించి మాట్లాడేవాడు కాదు. దేవుడు వున్నా, లేకున్నా, నీవున్నావన్నది సత్యం. వ్యక్తి జీవితంలో ఆనందంగా వుండేందుకు ఎనిమిది సూత్రాల మార్గాన్ని సూచించాడు. భగవాన్ కూడ కోర్కెలు నశించినప్పుడు జ్ఞానం వస్తుందని, సర్వుల పట్ల

దయ చూపిస్తే, అప్పుడు వున్నది ఒకటేనని తెలుస్తుంది. అదే జ్ఞానమని చెప్పారు. ఇతరులకు సేవ చేయాలన్నది తెలిస్తే మనసు తన వక్ర మార్గాలను మానుకొంటుందని, యితరులకు సేవ చేయాలన్న మన తపనలో మనసు కరిగిపోతుందని అన్నారు. ఇదే అత్యుత్తమ స్థాయికి చేరినప్పుడు మనసు ఆత్మలో లీనమౌతుంది, అలాంటి ఆనందంలో మునిగిన జ్ఞానికి తన, పర భేదమన్నది వుండదు. జ్ఞాని సమక్షంలో వున్నప్పుడు కలిగే సంతోషం, పరిమళ ద్రవ సువాసన ఇతరులకు కోరకనే వ్యాపించినట్లు జ్ఞాని నుండి సర్వత్ర చుట్టుముట్టుతుంది.

ఋగ్వేదంలో ''అసతోమా సత్‌గమయ'' అన్న ఒక సూక్తి వుంది. 'సత్' అంటే 'ఏది ఉందో అది'. 'అసత్' అంటే 'ఏది లేదో అది'. 'అసత్' నుండి 'సత్' కు దారి చూపించమని. భగవాన్ ప్రకారం, లోదృష్టితో పరికించినప్పుడు, పూజ, జపం, ధ్యానాలను సరిగా నిర్వర్తించినప్పుడు మనం ఏమీ మాట్లాడినప్పటికీ, ఎఱుకలో మాట్లాడతాము. మన జవాబులు, ప్రతిక్రియలు క్షణిక స్పందనతో వుండవు. మన మాటలపై అదుపు వుంటుంది. మన పనులపై అదుపు వుంటుంది. కాలక్రమేణ, ఈ అదుపు పరిపూర్ణమౌతుంది.

## శ్వాస నియంత్రణ

శ్వాసపై ధ్యాస గురించి బుద్ధుడు, భగవాన్ కూడ సలహా యిచ్చారు. ఉచ్ఛ్వాస, నిశ్వాసాలను గమనిస్తూ చేయడం ఒక మంచి మార్గంగా చెప్పారు. సాధారణంగా, జీవితాంతం మనం ప్రతి క్షణం, మనకు తెలియకుండగనే ఈ శ్వాస క్రియను జరుపుతుంటాం. అలా కాకుండ ప్రతి శ్వాసను గమనిస్తూ జరిపితే, మన గురించి

పూర్తి ఎఱుకలో వుండగలుగుతాం. క్రొత్తల్లో అది చాలా కష్టంగా అనిపిస్తుంది. కొన్ని క్షణాలకంటే ఎక్కువసేపు అలా గమనిస్తూ చేయలేము, తరువాత రెండు, మూడు నిమిషాల కాలం పాటు చేయవచ్చు. క్రమంగా శ్వాసను గుర్తించే క్రియను అలవాటు చేసుకుంటే అది మనోనాశనానికి దారితీస్తుంది. పూర్తిగా అదుపు వచ్చేసరికి, మనసు మీద అధికారం ఏర్పడుతుంది. ఆ స్థితిలో మనసు ఆత్మలో లీనమౌతుంది.

జ్ఞాని యొక్క శ్వాసక్రియ మనతో పోలిస్తే చాలా భిన్నంగా వుంటుంది. ఎక్కువ సేపు ధ్యానం చేసే వ్యక్తి యొక్క నాడీ వేగం పడిపోతుందని డాక్టర్లు చెబుతారు. ఎఱుక ఎక్కువైన కారణంగా వాళ్ళలో కలత తక్కువగా వుంటుంది. శాస్త్రీయ పరిశోధకులు కూడ ధ్యానం ఎక్కువగా చేసేవారు. ఇతర పనుల్లో మునిగి వున్నప్పుడు కూడ పరిసరాల ఎఱుకను ధ్యానం చేయని వారి కంటె ఎక్కువ కలిగి వుంటారని తెలిపాయి. అందుకే విద్యార్థులు, సైనిక సిబ్బంది, ధ్యానం చేయడం ద్వార వాళ్ళ పరిసర జ్ఞానం, అంతరంలో జరిగే, ఎఱుకను పెంచుకోవచ్చు. పురాతన ఋషులు, జ్ఞానులు విషయాన్ని ఎప్పుడో తెలియబరిచారు. శ్వాసను గమనిస్తూ వుండడం, అదుపు చేయడం ఎంత సులభమో అంత కష్టం కూడ. ప్రాణాయామం కూడ అలాగ అదుపును చేయడంలో సహాయపడగలదు. ధ్యానం చేయుడానికి తగిన ఆసనం గురించి భగవాన్ చెబుతూ పద్మాసనంలో కూర్చోలేనివారు తమ శరీరానికి అనువైన సుఖాసనంలో కూర్చొనవచ్చునని వ్యాఖ్యానించారు. నిద్రపట్టని విధంగా ఆసనాన్ని నిర్ణయించుకోవాలి.

మొట్టమొదట మనం చర్చించుకున్నట్లు, సత్యాన్ని నిరంతరం పలికే వ్యక్తి మరేదీ చేయనక్కరలేదు. ఏ భయమూ లేనప్పుడే సత్యవ్రతాన్ని పాటించగలం. కోరికలేవీ లేనప్పుడు భయాలు వుండవు. కోరికలను వదిలించుకొనేందుకు భగవద్గీతలో చెప్పినట్లు - ప్రజహాతియదాకామాన్ సర్వాన్ పార్థమనోగతాన్। ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థిత ప్రజ్ఞస్తదోచ్యతే ॥ అన్ని కోరికలను త్యజించిన వ్యక్తి, సత్యం, చైతన్యం, ఆనందాల స్వరూపంగా వుంటాడు.

# శ్రీ భగవాన్ సేవలో

- జి. శ్రీహరిరావు

## 18. శ్రీ భగవాన్ వీలునామా

ఒకప్పుడు శ్రీభగవాన్‌కు గొప్ప భక్తుడైన పెరుమాళ్‌స్వామి తిరుగుబాటు చేసి ఆశ్రమాన్ని న్యాయస్థానాల చుట్టూ తిరగవలసిన పరిస్థితులను కల్పించడం గురించి ఇంతకుముందు చూసాం. శ్రీభగవాన్‌కు బాగా దగ్గరైన భక్తులు కొందరు, బాగా పరపతి కలిగిన వారు, ఆశ్రమానికి సంబంధించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలకూ, రోజువారీ జరిగే పూజ పునస్కారాలకూ, సాధకులకూ, పేదలకూ చేయబడే సేవా కార్యక్రమాలకూ భవిష్యత్తులో న్యాయపరంగా ఎటువంటి ఇబ్బందులూ కలగకూడదనే ఉద్దేశ్యంతో, శ్రీభగవాన్ అనుమతితో, ఒక వీలునామా తయారు చేయాలని సంకల్పించారు. వారి సలహా మేరకు, సేలంలో బాగా పేరు ప్రఖ్యాతులున్న వ్యక్తీ, మద్రాసు ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా ఇదివరకు

పనిచేసిన దివాన్ బహదూర్ కె. సుందరం చెట్టిగారు బాగా ఆలోచించి,, ఒక వీలునామా తయారు చేసారు. దాని నమూనాను శ్రీభగవాన్‌కు చూపించగా వారు కొన్ని సవరణలు చేసారు. కావలసిన సవరణలతో మరో ముసాయిదా తయారుచేసి మళ్ళీ శ్రీభగవాన్ ముందు వుంచారు. మరికొన్ని మార్పులూ, చేర్పులూ చేసిన తర్వాత, వీలునామాను ఈ క్రింది విధంగా రూపొందించారు.

''శ్రీరమణాశ్రమం అనబడే ఈ సంస్థకు, (దీనికి సంబంధిత సంస్థలన్నిటికీ) చెందిన ఆస్తులన్నీ, ఇంతకుముందే ప్రతిష్ఠింపబడి సంప్రోక్షణ చేయబడిన శ్రీమాతృభూతేశ్వరస్వామికీ, నా మరణం తర్వాత నా చిహ్నంగా ఆశ్రమంలోనే సముచిత స్థానంలో ప్రతిష్ఠింపబడి సంప్రోక్షణ చేయబడే విగ్రహానికీ నాచేత అంకితమివ్వబడినవి. ఈ ఆస్తులన్నీ, ఈ రెండు విగ్రహాలకూ చెందిన స్థిరాస్తులవుతాయి. వీటికి చేయవలసిన నిత్య పూజలకూ, అనుబంధిత ఆస్తులను తగు విధంగా, సక్రమంగా భద్రపరిచే బాధ్యత నా తమ్ముడు నిరంజనానంద స్వామికి అప్పజెబుతున్నాను. ఆయన తర్వాత, వారి కుమారుడు శ్రీటి.ఎన్. వేంకట్రామయ్యర్‌కు ఆశ్రమానికి సర్వాధికారిత్వం లభిస్తుంది. ఈ ఆశ్రమ నిర్వహణాధికార హక్కు కుటుంబహక్కుగా, తరతరాలుగా, అతని మగ సంతానానికి చెందిన సభ్యులకు ఒకరి తర్వాత ఒకరికి లభిస్తుంది.''

వీలునామా చివర, తన సంతకం పెట్టే బదులు శ్రీభగవాన్ కలంతో ఒక గీత గీసారు. ఈ క్రింది వాక్యంతో వీలునామాను ముగించారు.

''ఈ వీలునామాను ముగించటానికి, నాకు సంతకం పెట్టే

అలవాటు లేనందున ఒక గీత గీస్తున్నాను. నా బదులు, నా సమక్షంలో సంతకం పెట్టడానికి శ్రీగ్రిద్దలూరి సాంబశివరావుగారికి అధికారం ఇస్తున్నాను.''

రిజిస్ట్రారు ఆఫీసుకు చెందిన సబ్ రిజిస్ట్రారుగారిని ఆశ్రమానికి తీసుకు వచ్చారు. వీలునామాను శ్రీభగవాన్‌కు చదివి వినిపించి, తగు సాక్షి సంతకాలతో, 1938 మార్చి 6వ తారీఖున దానిని రిజిష్టర్ చేసారు.

ఈ దిగువ ఆరుగురూ సాక్షి సంతకాలు చేసారు:

1. పదవీ విరమణ చేసిన ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి, దివాన్ బహదూర్ సుందరం చెట్టియార్‌గారు.

2. మద్రాసు రిజర్వు బ్యాంకు కార్యనిర్వహణాధికారి శ్రీ ఎమ్.ఎమ్. భార్గవగారు.

3. శ్రీ యోగి రామయ్యగారు.

4. శ్రీ టి.ఎస్. రాజగోపాలయ్యర్ గారు.

5. మద్రాస్, మైలాపూరుకు చెందిన డాక్టర్ శ్రీ టి.ఎన్.క్రిష్ణ స్వామిగారు.

6. ఓమలూరు తాలూకా సబ్ రిజిస్ట్రార్ శ్రీ ఆర్. నారాయణయ్యర్ గారు.

శ్రీ భగవాన్ వీలునామా ఆదేశ ప్రకారం మా కుటుంబ వంశపార పర్యంగా ఆశ్రమ యాజమాన్యం పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి లభించిన ఈ అధికారం నాకూ, నా కుటుంబ సభ్యులకు లభించిన మహద్భాగ్యంగా భావించి, ఈ అర్హతకు నేను తగును అనిపించు కోవడానికి నా శయశక్తులా కృషి చేస్తున్నాను.

## 19. బుల్లి సర్వాధికారి

నా తండ్రి శ్రీనిరంజనానందస్వామి క్రమశిక్షణపట్ల చాలా కఠినంగా వ్యవహరించేవారు. నేను 1938లో ఆశ్రమానికి వచ్చినప్పటినుండీ, వారు దేహం చాలించేవరకు నాతో పితృవాత్సల్యంతో ఒక్క మాట మాట్లాడ లేదు. అలాగే, నాలో తప్పులు వెదికి సూదులవంటి మాటలతో నన్ను గాయపరచే అవకాశం ఒక్కటీ వదిలేవారు కాదు. సన్యసించటం వలన, నాతో వారి సంబంధం చాలా అంటీముట్టనట్లుగా వుంచేవారు. మా ఇంటికి ఒక్కసారి వచ్చి, కుటుంబాన్ని ఆశీర్వదించమని నా భార్య అనేకసార్లు ప్రాధేయపడేది. ఆయన ససేమిరా ఒప్పుకునేవారు కాదు. ఆశ్రమంలో అనేకసార్లు సామూహిక ఛాయాచిత్రాలు తీయబడినప్పుడు, నన్ను దగ్గరకు రానిచ్చేవారు కాదు. ఒకటి రెండు రోజులు అవసరమై తిరువణ్ణామలై వదిలి వెళ్ళాలంటే ఒప్పుకునేవారు కాదు. ఒకవేళ నేను వెళ్ళానంటే కస్సుబుస్సుమనేవారు. ఎపుడైనా, ఏదైనా పక్క ఊరికి బంధువులది గానీ, స్నేహితులదిగానీ, పెళ్ళిళ్ళ సందర్భంలో కుటుంబంతో వెళ్ళవలసి వచ్చేది. వెంటనే ఆయన శ్రీభగవాన్‌కు "ఏదో సాకుతో వెళ్ళిపోతాడు" అని ఫిర్యాదు చేసేవారు. గృహస్థుగా నా బాధ్యతలను నిర్వహించకుండా ఆపటం భావ్యం కాదని శ్రీభగవాన్ సర్ది చెప్పేవారు.

ఆశ్రమ పనుల కోసం శ్రీనిరంజనానందస్వామి అపుడపుడూ తిరవణ్ణామలై వదిలి వెళ్ళేవారు. అంతేగాక, ప్రతి సెప్టెంబర్ మాసంలో మధుర, తిరుచ్చుళి వెళ్ళి కొన్ని రోజులు వుండి వచ్చేవారు. వారు లేనపుడు, వారి బాధ్యతలన్నీ నేను నిర్వహించవలసి వచ్చేది. ఆ సమయంలో, ఎవరైనా శ్రీభగవాన్ దగ్గరకు తగు సూచనలకుగానీ,

నిర్ణయాలకుగానీ వెళ్ళినపుడు, ''వెంకిటూని అడగరాదా? అతను బుల్లి సర్వాధికారి కదా!'' అనేవారు. చాలాసార్లు ముఖ్యమైన విషయాల పరిష్కార సందర్భాలలో, ''ఎందుకైనా మంచిది, వెంకిటూని కూడా సంప్రదించండి. భవిష్యత్తులో సర్వాధికారి అతనే కదా?'' అని సెలవిచ్చేవారు.

ఒకసారి, శ్రీభగవాన్ మొదటి పుస్తకం ''నేనెవడను?'' ప్రతులు అయిపోయాయి. సర్వాధికారి ఊళ్ళోలేరు. గొప్ప దేశభక్తుడూ, 'త్యాగి' పత్రిక సంపాదకులూ అయిన రామశఠగోపన్‌గారు, పుస్తకానికి తాను 5000 ప్రతులు ముద్రించి పెడతాననీ, కాగితం కోసం కేవలం రూ.100 మాత్రం, ఆశ్రమం ఖర్చు పెడితే చాలుననీ చెప్పారు. నేను 'సరే' అన్నాను. శ్రీనిరంజనానందస్వామితో పని చేసే మౌని శ్రీనివాసరావు ఈ ఖర్చుకు ఒప్పుకోలేదు. ఈ విషయంపై మేమిద్దరం వాదులాడు కోవడం విన్న శ్రీభగవాన్, ''దీనికి వాగ్వాదం దేనికి? ప్రస్తుతం వెంకిటూ సర్వాధికారిగా వ్యవహరిస్తున్నాడు. అతను నిర్ణయం తీసుకున్నాడు, మీరు పైకం చెల్లించాలి'' అని ఆదేశించారు. పేరుకు తగ్గట్టుగా మౌని నిశ్శబ్దం వహించారు. స్కందాశ్రమ రోజుల నుండీ శ్రీరామనాథ దీక్షితార్ శ్రీభగవాన్‌కు గొప్ప భక్తులు. ఆయన పీలగా, పొట్టిగా వుండేవారు. కానీ, చాలా పట్టుదలగల వ్యక్తి. నుదుట, ఛాతీకి, చేతులకు విభూతి ధరించేవారు. అమ్మ అళఘమ్మ సమాధివద్ద పూజ ప్రారంభమైనప్పటి నుంచి, ఆయనే స్కందాశ్రమం నుంచి ప్రతిరోజూ దిగివచ్చి పూజచేసి వచ్చేవారు.

1930లో రాజాజీ ఆధ్వర్యంలో వేదారణ్యంలో జరుపబడిన ఉప్పు సత్యాగ్రహంలో ఆయన పాల్గొన్నారు. తర్వాత ఆయన ఆశ్రమానికి

తిరిగి వచ్చినపుడు, శ్రీనిరంజనానందస్వామి ఆయన ప్రవేశానికి అనుమతిని ఇవ్వలేదు. సత్యాగ్రహంలో పాల్గొనవద్దని తాను చెప్పినా, తన మాట ధిక్కరించారని, ఆయనకు చాలా కోపం వచ్చింది. అలా ఆశ్రమం నుండి పంపివేయబడిన దీక్షితార్, ఊళ్ళో నీలకంఠయ్యర్ గారి ఇంట్లో రోజూ పూజ చేసుకొని, భోజనం చేసి, చిన్న డబ్బాలో రాత్రి పల్లాకొత్తులో తినటానికి భోజనం పెట్టుకుని, మధ్యాహ్నం రెండు గంటలకు చెమటలు కక్కుఉంటూ మండుటెండలో ఆశ్రమానికి వచ్చేవారు. నేను ఆశ్రమంలో చేరినప్పటి నుండి, వారి కోసం పిండి రుబ్బే గది దగ్గర ఒక కప్పు కాఫీ వుంచేవాడిని. ఆయన చప్పుడు చేయకుండా వచ్చి త్రాగి వెళ్ళిపోయేవారు. ఇది సర్వాధికారికి నచ్చేది కాదు. ఆశ్రమ వంటశాలలో పనిచేసే నటేశయ్యర్‌ను పిలిచి, దీక్షతార్‌కు ఎవ్వరూ కాఫీ ఇవ్వకూడదని ఆదేశం ఇచ్చారు. ఒకరోజు దీక్షితార్ వచ్చి కాఫీ అడిగినపుడు నటేశయ్యర్ నిరాకరించాడు. నేను కల్పించుకొని "సరే! సర్వాధికారిగారు ఇవ్వవద్దన్నారు కాబట్టే వారి ఆజ్ఞ పాటించావు. ఇపుడు నేను సర్వాధికారిగా వ్యవహరిస్తున్నాను. ఆయనకు కాఫీ ఇవ్వమని నేను చెబుతున్నాను" అన్నాను. అయ్యర్ నా మాట వినలేదు. "సరే! నీవు ఆశ్రమం విడిచిపో!" అని ఆజ్ఞాపించాను. అయ్యర్ పరుగున శ్రీభగవాన్ వద్దకు వెళ్ళి జరిగింది వివరించాడు. శ్రీభగవాన్ ఎప్పటిలాగానే, నెమ్మదైన స్వరంతో, "అవును. వెంకిటూ ఇపుడు సర్వాధికారిగా పని చేస్తున్నాడు. ఆయన చెప్పిన మాట వినాలి" అన్నారు.

అలా అనేకసార్లు, శ్రీభగవాన్ నన్ను "బుల్లి సర్వాధికారి" అనీ, 'నిర్వాహక సర్వాధికారి' అనీ, 'భవిష్యత్ సర్వాధికారి' అనీ సంబోధించే వారు. *(సశేషం)*

## అనుస్మరణీయులు

# శ్రీ యలమంచిలి మల్లయ్యగారు

- వీ. రమేష్‌బాబు

కృష్ణాజిల్లా పామర్రు మండలం, కనుమూరు గ్రామం శ్రీమల్లయ్య గారి జన్మస్థలం. రైతు కుటుంబానికి చెందిన యలమంచిలి బుల్లెమ్మ, మౌళయ్యగార్ల తొమ్మిది మంది సంతానంలో చివరివారు మల్లయ్యగారు. అందరూ ముద్దుగా 'బుజ్జి' అని పిలిచేవారు. స్వంత గ్రామంలో పాఠశాల లేనందున ఒకటిన్నర మైలు దూరంలో తాడంకి గ్రామానికి నడిచి వెళ్ళి చదువుకునేవారు.

మల్లయ్యగారికి 14 ఏళ్ళ వయసప్పుడు తీవ్రమైన జబ్బుతో వున్న తండ్రిగారు మల్లయ్యను పిలిచి, తన ఆరోగ్యం ఏమీ బాగా లేదని చెబుతూ, మల్లయ్య గారికి ఇలా చివరి హితబోధ చేశారు: "నిన్ను భగవంతుడే రక్షిస్తాడు. మనం తిన్నది మట్టిపాలు, ఇతరులకు పెట్టినది మన పాలు. పెట్టని వానికి పుట్టనిదే సాక్షి, పెట్టిన వానికి పుట్టినదే సాక్షి. మనం నూరు మేళ్ళు ఇతరులకు చేస్తే, భగవంతుడు మనకు ఒక మేలు చేస్తాడు. నేను చెప్పే మాటలు నీవు బాగా గుర్తుంచుకో" అన్నారు. తండ్రిగారి మాటల పరమార్థం అనుక్షణం తన చెవుల్లో మారుమ్రోగుతుంటే, ఆ మహనీయుని ఆశీస్సుల వల్లనే తాను, కుటుంబ సభ్యులు, సుఖసంతోషాలతో వర్ధిల్లుతున్నామని మల్లయ్య భావించేవారు. ఆనాడే భగవాన్ రమణమహర్షి తన తండ్రి హృదయంలో ప్రవేశించి అలాగ దీవెనలు ఇప్పించారని మల్లయ్య గారి ప్రగాఢ విశ్వాసము.

శ్రీ మల్లయ్యగారి ఏకైక సోదరి శ్రీమతి రామతులశమ్మ గారు భర్త శ్రీవెల్లంకి వేంకట్రామయ్యగారి మరణం తరువాత పుట్టింటికి చేరారు. తండ్రి మరణం తరువాత మల్లయ్యగారు హైస్కూలు, ఇంటర్మీడియెట్ చదువుతున్నప్పుడు ఆమె మల్లయ్య గారికి తోడుగా వుండి చదివించింది. గుడివాడ మున్సిపల్ ఆఫీసులో ఉద్యోగం చేస్తూ వుండిన మల్లయ్యగారు పామర్రుకు చెందిన శ్రీరామినేని వేంకట్రామయ్య గారి కుమార్తె శ్రీమతి జయప్రదాదేవిని పెళ్ళాడారు. తోడుగా రామతులశమ్మగారు వుండేవారు. శ్రీరామకృష్ణ పరమహంసను తన గురువుగా భావించిన మల్లయ్యగారు, మితాహారం తీసుకుంటూ, భక్తి ప్రపత్తులతో జీవనం గడిపేవారు. సహోద్యోగులు ఆయనను ఒక ఋషిలాగ భావించేవారు. గుడివాడలో క్రొత్త కాలనీలో ఇల్లు కట్టుకున్న సమయంలో అక్కడికి మల్లయ్యగారంటే ఎనలేని గౌరవం, అభిమానమున్న మున్సిపల్ కమిషనర్‌గారు, మల్లయ్యగారి ఇల్లున్న వీధికి యలమంచిలి మల్లయ్య వీధి అని నామకరణం చేశారు.

మల్లయ్యగారికి రమణభక్తులైన లోయ లక్ష్మీ పెరుమాళ్ గారు మంచి మిత్రులు. 1950 సం॥ ఏప్రిల్ నెలలో మహర్షి చాలా క్షీణించిన ఆరోగ్యంతో వున్నట్లు మహర్షి భక్తులు చాపరాల వేంకట నారాయణగారు పెరుమాళ్ గారికి తెలిపారు. హుటాహుటిన తిరువణ్ణామలై వెళ్ళిన లక్ష్మీ పెరుమాళ్‌గారు మహర్షి నిర్వాణం తరువాత వారి శరీర ఖననం, సమాధి రమణేశ్వర ప్రతిష్ఠ కార్యక్రమాలకు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తిరిగి వచ్చిన పెరుమాళ్ గారు శ్రీ మల్లయ్యకు మహర్షి చిత్రపటాన్ని ఇచ్చారు.

తులశమ్మగారు దానికి పూజా కార్యక్రమాలను జరుపుతుండేది. కుటుంబం హైదరాబాదు మారింది.

1968లో మంచిర్యాలలో రైల్వే కాంట్రాక్టు పనులు చేస్తున్న మల్లయ్యగారికి మే 10న కలలో వివాహం కోసం నిర్మించిన తాటాకు పందిరి అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైపోగా చాలా మంది స్త్రీలు మంటల్లో మాడి మసి అయిపోయారు. తెల్లవారిన తరువాత ఆ మంటల్లో విజయవాడకు ఆ పెళ్ళికి వెళ్ళిన జయప్రదా దేవిగారు అందులో ఆహుతైపోయినట్లు మల్లయ్యగారికి వార్త అందింది. దుఃఖ భారంతో విలవిలలాడారు. సెప్టెంబర్ 10న మల్లయ్యగారికి కలలో రమణ భగవాన్ అగుపడి జనన మరణ చక్రం తిరుగుతూనే వుంటుంది. అందరూ ఒక రోజు మరణిం చాల్సిందే. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వర్తమానంలో వ్యవహరించ వలసిందని ఆదేశమిచ్చారు. వెంటనే ఊరట చెందిన మల్లయ్యగారు తిరిగి మామూలు కార్యక్రమాల్లో మునిగారు. ధైర్యంతో ఎక్కడా బయటపడకుండ గంభీరంగా వుండసాగారు. రాత్రిళ్ళు మాత్రం ఒంటరిగా రమణుల చిత్రపటం ముందు కూర్చొని దుఃఖించేవారు. తామే తిరిగి ధీమాగా వుంటుండేవారు. శ్రీరమణులపై కవులు, రచయితలు వ్రాసిన సద్భావాలు గల కవితలు, పద్యాలు చదువుకుంటూ ఆనందించేవారు.

కాలక్రమంలో ఆయన మనసుకు తాము కూడ రమణుల గురించిన తమ భావాలకు అక్షర రూపమివ్వాలని వచనంలో శ్రీరమణ మహర్షి జీవిత కథా కథనం చేయను మొదలుపెట్టారు. యథాలాపంగా ఆచార్య దివాకర్ల వేంకటావధానిని కలిసిన సందర్భంలో తమ రచనలను చూపించి అభిప్రాయం కోరినప్పుడు

అవధానిగారు వచనం కంటే పద్యరూపంలో వుంటే బాగుంటుందని, తేటగీతి, ఆటవెలది పద్య లక్షణాలు చెప్పి ప్రోత్సహించారు. అలాగ రమణ జీవితచరిత్రను 135 పద్యాలలో రచించారు. వాటి పరిష్కారం కోసం అవధాని గారిని కలవాలనుకునేటప్పటికి అవధాని గారు కాలధర్మం చెందారు. ఆ తరుణంలో హైదరాబాదులో వీరమాచనేని పడగయ్యగారు నిర్మిస్తున్న ఉన్నత పాఠశాల భవనానికి తల్లిదండ్రుల, అక్క,బావల పేరిట రెండు గదుల నిర్మాణానికి విరాళం ఇచ్చారు. అప్పుడు అక్కడి తెలుగు పండితులుగా వుంటున్న ఈ వ్యాస రచయిత (వీ. రమేశ్‌బాబు)తో పరిచయమైంది. వారితో కలిసి రచనల పరిష్కార సమీక్షలు జరప మొదలుపెట్టారు.

మల్లయ్యగారి తొలిరచన ''ఎవరి నేమన్ననేమి ప్రయోజనంబు'' కారణాంతరాల వల్ల వెలుగుచూడలేకపోయింది. భగవాన్‌పై కలిగిన భక్తి రసాత్మక భావనలతో నిండినది మల్లయ్యగారి రెండవ రచన. అది 108 వచన కవితల శతకం. ఆయన రేయింబవళ్ళు శ్రమించి, తపించి రచించిన ''శ్రీరమణాకథా సుధ''. అది శ్రీరమణమహర్షి జీవితాన్ని సమగ్రంగా చిత్రీకరించిన పద్యకావ్యం. ఈ రచనలలోని కొన్ని పద్యాలను శ్రీ అత్యం సూర్యం గారు తమ గ్రంథం ''వినీలాకాశంలో వింతకాంతి'లో మల్లయ్యగారి అనుమతి తీసుకుని చేర్చుకున్నారు. ఇక ''శ్రీరమణ మహర్షి ప్రభూ, నీకూ, నాకు మధ్య'' అన్న రచన కూడ 108 తేటగీతులతో సరళమైన భాషలో సాగిన మల్లయ్యగారి మరొక భక్తి, ఆత్మీయత, ఆర్తితో నిండిన రచనా కుసుమం. ఇలాంటివే గాకుండ మరికొన్ని రచనలు పది శతకాలు కూడ ఈ భక్తుని రచనలే. ఇవి చాలావరకు అముద్రితాలు. మూడింటిని మాత్రం పరిమితంగా ముద్రించి

రమణకేంద్ర భక్తులకు అందజేశారు. 1992 సం॥లో అప్పటి రమణాశ్రమ అధ్యక్షులు శ్రీ టి.ఎన్. వెంకట్రామన్ గారు శ్రీరమణ కథాసుధ కావ్యానికి ఇచ్చిన ముందు మాట (తెలుగు అనువాదం) ఇలా నడుస్తుంది. "శ్రీరమణులకు గొప్ప భక్తులు మల్లయ్యగారు. రచనలలో వారు భగవాన్ చేతిలో ఒక ఉపకరణమే కాని తమ కర్తృత్వం లేదంటారు. మల్లయ్యగారు వినయంగా, నిరాడంబరంగా వుంటారు. అంతా భగవాన్ దయ అంటారు. భగవాన్ రమణుల వారి కుటుంబాన్ని ఆశీర్వదించుగాక. భగవాన్ భక్తులకు ఈ రచన ఆనందాన్ని కలిగించుగాక".

డా॥ కె.ఎస్. గారంటే మల్లయ్యగారికి వర్ణించలేని గౌరవం, భక్తి, ప్రపత్తులు. శ్రీమల్లయ్యగారు హైదరాబాదు శ్రీరమణకేంద్రంలో చాలా చురుగ్గా పాల్గొంటూ వచ్చిన గొప్ప భక్తులు. (ఆ సంస్థకు ఎనలేని సేవ చేశారు). ఒంటరిగా వున్నప్పుడు కూడ రమణ మహర్షి పటం ముందు ఆర్తితో ప్రార్థిస్తూ ఆవేదనలను చెప్పుకునేవారు. అలాంటి సందర్భాలలో ఒకసారి డా॥ కె.ఎస్.గారి పోస్టుకార్డు ద్వారా పంపిన సందేశం "గ్రేస్ ఈజ్ ఆల్వేస్ ఫ్లోయింగ్" అందింది. పరమ శాంతిని పొందారు. అలాగే మరొకసారి వచ్చిన సందేశం "ది గురు ఈజ్ విథిన్ యు"ను అందుకున్న మల్లయ్యగారికి సందేహం పటాపంచలయింది. అప్పటిదాకా మహర్షి గురించి పూజా, ప్రార్థనలు ఎలా చేయాలి అని చర్చించుకుంటున్న మల్లయ్య గారికి చక్కని ఉపదేశం లభించిందని సంతోషపడ్డారు. ఆయన అందరికీ సమస్యలను డా. కె.ఎస్. గారికి విన్నవించుకుంటే అన్నీ సర్దుకుంటా యని సలహా ఇచ్చేవారు. డా. కె.ఎస్.గారిపై అంత గాఢమైన నమ్మకాన్ని పెంచుకున్నారు.

"అందుకొనుమన్న భగవాన్ నాదు ప్రణతులు - ఇవిగో" అన్న మల్లయ్యగారి గ్రంథానికి ముందు మాట వ్రాస్తూ డా. కె.ఎస్. గారు ఇలా వ్యక్తీకరించారు. శ్రీరమణుని నమ్మిన గొప్ప భక్తులు మల్లయ్య గారు. భగవాన్‌కు సంపూర్ణ శరణాగతి పొందినవారు. వారి రచనలకు రచయితగా పేరు పెట్టుకొనడానికి కూడ అంగీకరించారు. భగవాన్ భక్తిలో మనసులో కలిగిన భావాలు కాగితం మీద వుంచాను, శ్రీరమణానుగ్రహం, అంటారు. ఈ గొప్ప భక్తుని రచన పాఠకుల మదిలో కలకాలం నిలిచి వుంటుంది". పిమ్మట డా. కె.ఎస్. గారి సలహా మేరకు తమ పేరు వ్రాసుకొనడానికి అంగీకరించారు. డా. కె.ఎస్.గారికి, మల్లయ్యగారికి, వున్న అనుబంధం మాటలలో వర్ణించలేనిది. డా. కె.ఎస్.గారి కుటుంబసభ్యులందరితో ఆత్మీయంగా మెలిగేవారు.

మల్లయ్యగారి దాతృత్వం గొప్పది. అంతేకాదు, ప్రత్యేకించి కుడిచేతితో చేసిన దానం ఎడమచేతికి తెలియనీయని వ్యక్తి, విద్యార్థులకు, విద్యాసంస్థలకు, అన్నదాన సమాజాలకు, దేవాలయాలకు, ఎందరికో ప్రతినెలా తాము తయారు చేసుకున్న చిట్టా ప్రకారం విరాళాలు అందించిన వితరణశీలి. ఎంతోమందికి శ్రీరమణజ్యోతి సంవత్సర చందాను తమ తరఫున చెల్లించేవారు. శ్రీరమణ సత్సంగం ఆంధ్రమహిళా సభా కాలేజీ నిర్వహించే రోజుల్లో, భక్తుల సౌకర్యార్థం మైకు సెట్టును కొని బహూకరించారు. కొసమెరుపు ఏమిటంటే వారు ఏయే సంస్థలకు, వ్యక్తులకు విరాళాలు ఇచ్చేవారో ఆయన కుమారులకు కూడ తెలియదు.

శ్రీరమణకేంద్రం స్వంత భవన నిర్మాణానికి సంపాదనకు మల్లయ్యగారు స్వయంగా అప్పటి కలెక్టర్ రత్నకిషోర్ గారిని కలిసి

శ్రీరమణకేంద్రం అంటే ఏమిటి? శ్రీరమణుల విశిష్టత, కేంద్రం నిర్వహించే ఆదర్శ విధానం మొదలైనవన్నీ వివరించారు. ప్రభుత్వం శివం రోడ్‌లో కేటాయించిన స్థలం బండరాళ్ళతో, ఎత్తుపల్లాలతో వుండేది. మల్లయ్యగారు తమ కుమారుని వద్దనున్న ప్రొక్లెయిన్‌ని వినియోగించి, వారి మనుషులతో స్థలాన్ని సరిచేయించారు. ఒక చక్కని భవన నిర్మాణానికి పునాదిపడింది. శ్రీరమణ భక్తుల సంకల్పం, డా. కె.ఎస్.గారి ఆశీస్సులతో అనువైన భవనం శ్రీరమణ కేంద్రానికి ఏర్పడింది.

శ్రీరమణకేంద్రం వారు 2007 సం॥లో సెప్టెంబర్ 1వ తేదీ జరుపవలసిన వేడుకలను (ఆదివారం) మరుసటి రోజు జరిపారు. మల్లయ్యగారు ఆ కార్యక్రమానికి హాజరై యితర భక్తుల సన్నిధిలో ఆనందంగా గడిపారు. సెప్టెంబరు 3వ తేదీ ఏ ఇబ్బంది లేకుండ, మామూలుగా కార్యక్రమాలు జరుపుతూనే 8.10 గం॥లకు చివరి శ్వాస విడిచారు. ఆయన ఆశిస్తూ వుండినట్లే అనాయాస మరణాన్ని పొందారు. శ్రీరమణకేంద్ర భక్తులు అక్షరమణమాల, ఉపదేశసారము పఠించారు. మల్లయ్యగారి కోరిక మేరకు కర్మకాండలు జరపకుండ పార్థివదేహాన్ని విద్యుత్ దహనవాటికకు తరలించారు.

పురాణాలలో ప్రహ్లాదుడు, ధ్రువుడు, శబరి, విదురుడి వంటి భక్తులను గూర్చి విన్నాం, చదువుకున్నాం. మళ్ళీ అలాంటి భక్తుడైన శ్రీమల్లయ్యగారిని మనం సమకాలికులుగా చూశాం. ఇది మన అదృష్టం అంటారు, శ్రీరమణకేంద్ర సీనియర్ భక్తులు శ్రీకేశవ రెడ్డి గారు, శ్రీరమణయ్యగారు.

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ టి.కె. సుందరేశ అయ్యర్

**మల్లాది ఫణిమాల**

శ్రీ టి.కె. సుందరేశ అయ్యర్ (1896-1965) తిరువణ్ణామలైలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. శ్రీరమణాశ్రమానికి ఆ రోజుల్లో వచ్చే ఇంగ్లీషు మాట్లాడే సందర్శకులకు దుబాసీగా వ్యవహరించేవారు. ఆధ్యాత్మిక విషయంలో ఆశ్రమానికి వచ్చే ఉత్తర ప్రత్యుత్తరాలకు సంబంధించిన పనిచేస్తుండేవారు. ఇది శ్రీభగవానుల పర్యవేక్షణలో జరిగేది. 'ఎట్ ది ఫీట్ ఆఫ్ భగవాన్' అనే పుస్తకంలో వారి స్మృతులు ఉన్నాయి.

1908వ సంవత్సరంలో శ్రీభగవాన్ విరూపాక్ష గుహలో ఉండే వారు. అప్పుడు శ్రీటి.కె. సుందరేశ అయ్యర్ వయస్సు 12 ఏళ్లు. వారి బంధువు అయిన కృష్ణమూర్తి అనునతను ప్రతిరోజు శ్రీభగవాన్ వద్దకు వెళ్లి, భక్తిగీతాలు పాడుతూ ఉండేవారు. సుందరేశ అయ్యర్ ఈ విషయాన్ని గురించి కృష్ణమూర్తి గారిని అడిగినప్పుడు, వారు ఇలా సమాధానమిచ్చారు. ''సాక్షాత్తు అరుణగిరీశ్వరుడే మానవ రూపం దాల్చి భగవాన్ శ్రీరమణ మహర్షిగా విరూపాక్ష గుహలో కూర్చుని ఉన్నారు. కావున నాతోపాటు నువ్వు కూడా వస్తే బావుంటుంది''.

కృష్ణమూర్తి గారి మాటలు విని, శ్రీ భగవాన్ వద్దకు వెళ్ళుటకు సిద్ధపడిన సుందరేశ అయ్యర్ ఒకరోజు వారితో పాటే కొండ ఎక్కారు. విరూపాక్ష గుహలో శ్రీభగవాన్ ఒక రాతిబండ మీద కూర్చుని

వుండగా, చుట్టూ కొందరు భక్తులు కూర్చుని ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క పాట పాడి వినిపించారు. శ్రీభగవాన్ సుందరేశ అయ్యర్ వైపు తిరిగి, "నువ్వు పాడవా?" అని అడిగారు. భగవాన్ పాడమని అడిగిన వెంటనే సుందరేశ అయ్యరుకు శ్రీ సుందరమూర్తి నాయనార్ పాట గుర్తొచ్చింది. "ఓ భగవంతుడా! నీ పాద పద్మములు తప్ప నాకు మరే ఇతర ఆధారము లేదు. నీ పాదాలను ఆశ్రయించి నీ అనుగ్రహాన్ని అర్థిస్తున్నాను. నా మనస్సు తప్పు దారిని పట్టినా, నా నాలుక మాత్రం నీ దివ్యనామమునే పలికేటట్లు అనుగ్రహించు తండ్రీ!" అనే భావముగల పాటను పాడి వినిపించారు. శ్రీభగవాన్ ఎంతో సంతోషించి, "అవును! జరగాల్సింది అదే" అన్నారు. భగవాన్ పలికిన ఈ అమృతవాక్కులు వారికిచ్చిన ఉపదేశంగా భావించారు శ్రీసుందరేశ అయ్యర్. అప్పటి నుండి కొన్ని సంవత్సరాల పాటు ఒక్కరోజు కూడా విడువకుండా సుందరేశ అయ్యర్ శ్రీ భగవానుల దర్శనార్థం వారి వద్దకు వెళ్లారు.

ఒకరోజు వారికి ఇలా ప్రతిరోజూ కొండ ఎక్కడం వల్ల ప్రయోజనం ఏమిటి? ఇది అర్థం లేని శ్రమ అని అనిపించి, భగవాన్ వద్దకు వెళ్ళటం మానేసారు. అలా వెళ్లడం మానేసి మూడు నెలలు గడిచాయి. ఇక భరించలేక ఒకరోజు సుందరేశ అయ్యర్, శ్రీభగవాన్ దర్శనార్థం కొండ ఎక్కి విరూపాక్ష గుహ చేరుకున్నారు. వారు భగవాన్ పాదాల చెంత వాలిపోయి, కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు. ఎంతో వాత్సల్యంతో భగవాన్ సుందరేశ అయ్యర్‌ను లేవనెత్తి, "నేను నిన్ను చూసి మూడు నెలలు గడిచాయి. ఎక్కడికి వెళ్ళావు?" అని అప్యాయంగా అడిగారు. వారిని దర్శించటం వృథా అని అనుకొని

రావటం మానేశానని సుందరేశ అయ్యర్ చెప్పారు. దానికి భగవాన్ ఇలా అన్నారు. ''సరే వృధా ఏమో! అయితే మాత్రం ఏం? నీకు ఏదో నష్టం అయినట్లు అనిపించింది కదా... శ్రీభగవానుల వాత్సల్య పూరిత పలుకులను విన్న వెంటనే, వారి వద్దకు ఏదో లబ్ధి కోసం వెళ్లలేదనీను మరియు శ్రీభగవానులకు దూరంగా వారికి జీవితమే లేదని గ్రహించారు సుందరేశ అయ్యర్.

సుందరేశ అయ్యర్ శ్రీభగవానులను సందర్శించడానికి ఎప్పుడు వెళ్ళినా ఉత్తిచేతులతో వెళ్ళేవారు కాదు. భగవాన్‌కి ఆహారంగా నివేదించడానికి ఏదో ఒకటి కొని తీసుకుని వెళ్ళేవారు. ఆ రోజు తన వద్ద డబ్బు లేక భగవాన్ కోసం ఏమీ తీసుకుని వెళ్ల లేకపోయారు. భగవాన్ వద్ద నిరాశగా నిలబడి, ''ఈరోజు ఈ పేదవాడు మీ కోసం ఏమీ తేలేకపోయాడు'' అని విన్నవించు కున్నారు. సుందరేశ అయ్యర్ నిరుత్సాహాన్ని గమనించిన భగవాన్, ''ఏమీ తేకపోవడం ఏమిటి! నువ్వు అత్యంత ముఖ్యమైనది తీసుకొని వచ్చావు! దాని ముందు మిగిలినవి అన్నీ ఏ మాత్రము ముఖ్యం కాదు'' అని అన్నారు. భగవాన్ మాటలు విన్న సుందరేశ అయ్యర్‌కు ఏమీ అర్థం కాక, అలాగే నిలబడిపోయారు. వారికి ఈ విషయం బోధపరిచే రీతిలో భగవాన్ ఇలా అన్నారు. ''సుందరేశా, నీకు ఇంకా అర్థం కాలేదా? అన్నిటికంటే ముఖ్యమైనది నువ్వే! నిన్ను నువ్వు తీసుకొని వచ్చావు కదా! దాన్ని మించింది ఏమి ఉంటుంది కనుక!!''

ఆ రోజుల్లో, భగవాన్ బంగారు విగ్రహం వలె మెరిసే మేని ఛాయ కలిగి ఉండేవారు. ఎంతో అరుదుగా మాట్లాడేవారు. ఎప్పుడూ మౌనంలోనే ఉండేవారు. వారి కళ్ళనుండి ప్రసరించే

దివ్యకాంతి వారి వద్దకు వచ్చిన వారినందరినీ సమ్మోహన పరిచే విధంగా ఉండేది. వారి దివ్యసన్నిధిలో భక్తులు పొందే ఆనందం వర్ణనాతీతమని సుందరేశ అయ్యర్ అన్నారు.

1929లో తాను ఆధ్యాత్మికంగా ఎదగడానికి ఏమి చేయాలి అని శ్రీభగవానులను అడిగారు సుందరేశ అయ్యర్. భగవాన్ సుందరేశ అయ్యర్‌కు 'కైవల్యం' అనే పుస్తకాన్ని ఇచ్చి, అందులోని కొన్ని శ్లోకాల అర్థాలను కూడా ఎంతో చక్కగా వివరించారు. అప్పటి నుండీ, సుందరేశ అయ్యర్, పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉద్యోగం చేస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటూ, ఆధ్యాత్మికంగా ఎదగటమే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఒక అమావాస్య రోజు ఉదయాన, ఆశ్రమ వాసులు అందరు ఫలహారం చేయుటకు భోజనశాలలో కూర్చుని ఉండగా, సుందరేశ అయ్యర్, భోజనశాలకు వచ్చి, కూర్చోకుండా అలాగే నిలుచుండి పోయారు. భగవాన్ వారి వైపు చూసి ఫలహారం తీసుకోమని ఆదేశించారు. నా తండ్రి గారికి తద్దినం పెట్టవలసిన రోజు కావటం వల్ల నేను ఫలహారము చేయను అని సుందరేశ అయ్యర్ జవాబిచ్చారు. (పితరులకు తద్దినాలు పెట్టడం వెనుక ఉన్న అంతర్యం వారికి స్వర్గలోక ప్రాప్తి కావాలి అనే సంకల్పము) ఉదయపు ఫలహారం తినను అని సుందరేశ అయ్యర్ చెప్పగా విని, "మీ తండ్రి గారికి ఉత్తమగతి ప్రాప్తించి, స్వర్గంలో ఉన్నారు. కాబట్టి నువ్వు ఫలహారం తినటం వలన వారికి జరిగే హాని ఏమీ ఉండదు" అని భగవాన్ సూచించారు. ఎన్నో సంవత్సరాలుగా పాటిస్తున్న సంప్రదాయానికి చెందిన ఈ అలవాటును పక్కకు

పెట్టడానికి సుందరేశ అయ్యర్ ఎంతో వెనకాడారు. కానీ భగవాన్ వారిని కూర్చోబెట్టి ఎంతో ప్రేమతో ఇడ్లీలు తినిపించారు. అప్పటి నుండి సుందరేశ అయ్యర్ తన పితరులకు తద్దినాలు పెట్టడం మరియు గతించిన వారికి సంబంధించిన క్రతువులను చేయటం మానివేశారు.

సుందరేశ అయ్యర్ గారికి బాల్యంలో 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే మంత్రం పట్ల ఎంతో మక్కువ ఉండేది. శ్రీ భగవాన్ పాదాల చెంతకు వచ్చాక, వాసుదేవునికీ శ్రీభగవానులకు ఏ మాత్రము భేదము లేదనియు, భగవానులే అలనాటి వాసుదేవు డనియు, వారు నిర్ధారించుకున్నారు. అప్పుడు 'ఓం నమో భగవతే శ్రీరమణాయ' అనే మంత్రము వారికి స్ఫురించింది. ఈ మంత్రంలో కూడా 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే మంత్రంలో ఉన్నన్ని అక్షరాలు ఉన్నవని గ్రహించారు. సుందరేశ అయ్యర్. ఈ విషయాన్ని శ్రీభగవానులకు చెప్పగా, వారు ఈ కొత్త మంత్రాన్ని ఆమోదించారు. ఈ విధంగా 'ఓం నమో భగవతే శ్రీరమణాయ' మంత్రాన్ని మనకు ప్రసాదించిన ఘతన శ్రీసుందరేశ అయ్యరుగారికి దక్కుతుంది.

1933వ సంవత్సరంలో సుందరేశ అయ్యర్ 36వ జన్మదినాన భగవాన్ సన్నిధిలో కూర్చుని, "భగవాన్! నాకు 36 ఏళ్లు గడిచినా, అసలైన మీరెవరో అనుభవం కాలేదు. మీ అనుగ్రహ వర్షాన్ని కురిపించి, ఆ అనుభవాన్ని నాకు ప్రసాదించండి!" అని తమిళంలో ప్రార్థనా పూర్వకంగా ఒక కాగితం మీద రాసి, ఆ కాగితాన్ని భగవానులకి అందించి, వారికి ప్రణమిల్లారు. భగవాన్ వారిని కూర్చోబెట్టి తదేకంగా వారివైపు చూడనారంభించారు. భగవాన్ కృపా

కటాక్ష వీక్షణం సోకగానే సుందరేశ అయ్యర్ దేహ స్పృహ కోల్పోయి అంతర్ముఖులయ్యారు. "నీకు ఏది కావాలంటే దానిని చూడుము" అంటు భగవాన్ దివ్యవాణి సుందరేశ అయ్యర్‌కు వినబడింది. వారు శ్రీరామభక్తులు అవ్వటం చేత శ్రీరాముని దర్శనం కోరుకున్నారు. కోరుకున్న వెంటనే సీత, లక్ష్మణ, భరత, శతృఘ్న, హనుమత్ సమేత శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు. శ్రీరామ పరివారాన్ని దర్శించిన సుందరేశ అయ్యర్ ఆనందానికి అవధులు లేకపోయాయి.

మౌనంగా కూర్చుని దివ్యదృశ్యంలో మునిగిపోయిన సుందరేశ అయ్యరును భగవాన్ ఇంకా తదేకంగా చూస్తూనే ఉన్నారు. అలా మౌనంగా, రమారమి రెండు గంటలు గడిచిపోయాయి. ఆ దివ్య దృశ్యము అదృశ్యం అయిన తర్వాత సుందరేశ అయ్యర్ శ్రీభగవాను లకు సభక్తికంగా ప్రణమిల్లారు. సుందరేశ అయ్యర్ తన ఇష్టదైవాన్ని దర్శనం చేసుకునేలా చేసిన భగవాన్ ఈ విధంగా భగవంతుని (సర్వవ్యాపకతత్వాన్ని) (సర్వాంతర్యామితత్వాన్ని) (సర్వశక్తిమంతత్వాన్ని) (సర్వజ్ఞత్వాన్ని) గుణములను ప్రదర్శించారు.

శ్రీ భగవాన్, మనలో కొన్ని జన్మలుగా పాతుకుపోయిన వాసనలని, స్వార్థాన్ని, నిర్మూలించే ప్రయత్నం చేస్తూనే ఉంటారని సుందరేశ అయ్యర్ చెప్పారు (బహిరంగంగా మనకు తెలియకపోయినా).

1930 దశకం చివరిభాగంలో శ్రీభగవాన్ 'నూల్ తిరట్టు' (ఇంగ్లీష్‌లో కలెక్టెడ్ వర్క్సుగా ప్రచురించబడినది) అచ్చుకి సిద్ధంగా ఉన్న సమయంలో ముందుమాట వ్రాయాలని ఒక ప్రస్తావన

వచ్చినప్పుడు, ఎవ్వరూ అందుకు ముందుకు రాలేదు. ఎవరికి వారే తమకు అర్హత లేదని భావించారు. అదంతా భగవాన్ గమనిస్తూనే ఉన్నారు. రాత్రి 10.30 ప్రాంతంలో సుందరేశ అయ్యర్ హాలు ప్రక్కగా వెళుతున్నప్పుడు, భగవాన్ వారి వైపు చూసి, ''ఆ ముందుమాట నువ్వే ఎందుకు రాయకూడదు'' అని అన్నారు. భగవాన్ మాటలకు ఆశ్చర్యపోయిన సుందరేశ అయ్యర్, ''మీ అనుగ్రహం ఉంటే తప్పకుండా సాహసిస్తాను' అన్నారు. దానికి సమాధానంగా, ''తప్పకుండా వ్రాయి. బాగానే ఉంటుంది లే'' అని భగవానులు అన్నారు. భగవాన్ ఆశీర్వాద ప్రేరణ వలన సుందరేశ అయ్యర్ రాయటం మొదలుపెట్టి, తెల్లవారుజామున మూడు గంటలకి శ్రీభగవానుల వారి పాదాల వద్ద దానిని సమర్పించారు. వారు సంతోషించి ఆమోదించారు.

1960వ సంవత్సరంలో శ్రీ గణేశన్ గారు శ్రీ రమణాశ్రమంలో నివసించటానికి తరలి వచ్చినప్పుడు, ఆశ్రమ పెద్దలు వారి ఆధ్యాత్మిక అభివృద్ధికి ఎన్ని చక్కటి సలహాలు ఇచ్చిననూ శ్రీ గణేశన్ గారికి ఏదో వెలితి పొడ చూపుతూనే ఉంది. అలాంటి సందర్భంలో గణేశన్ గారి ఉపాధ్యాయులైన శ్రీ సుందరేశ అయ్యర్ గారు, వారిని కేరళ రాష్ట్రంలో ఉన్న జ్ఞాన గురువులు శ్రీ పాపా రామదాస్ వారి వద్దకు పంపారు. పాపా రామదాస్ గణేశన్ వారిని మాతాజీ కృష్ణా బాయి వద్దకు పంపి, ఆమె చెప్పినట్లు నడుచుకోమని సలహా ఇచ్చారు.

మాతాజీని గణేశన్ గారు, ''నేను ఏ రకమైన సాధన చేయవలెను?'' అని అడుగగా, భగవాన్ మహా సమాధి తదనంతరం

వారి శిష్యులంతా అరుణాచలం వదలి అటూ ఇటూ వెళ్ళిపోయారు. వారందరినీ వెనక్కి తీసుకు వచ్చి, వారిని కనిపెట్టుకుని, వారికి సేవ చేయి. ఇదే నీ సాధన'' అని ఆదేశించారు. మాతాజీ శ్రీ గణేశన్ గారికి ఇంత గురుతర బాధ్యతని అప్పచెప్పి, వారికి ఇంత చక్కని సాధనా మార్గాన్ని ఉపదేశించటం వెనుక గణేశన్ గారి ఉపాధ్యాయులు అయిన శ్రీ టి.కే. సుందరేశ అయ్యర్ గారి ప్రోద్బలం మరియు ప్రోత్సాహమే కారణం అని గణేశన్ గారు సుందరేశ అయ్యర్‌గారిని ఎంతో కొనియాడారు.

'టాక్స్ విత్ శ్రీరమణ మహర్షి'లో ఇలా వ్రాయబడి ఉన్నది.

ఊళ్ళో ఎవరో మహర్షిని చులకన చేస్తూ మాట్లాడినప్పుడు, తాను తగిన సమాధానం చెప్పలేదే అని టి.కె.ఎస్. అయ్యర్ ఎంతో వ్యాకులపాటుతో ఉన్నారు. ''ఆ తప్పిదమునకు శిక్ష ఏమిటి?'' అని మహర్షిని అడుగగా, మహర్షి బదులుగా, ''ఓర్పు! ఇంకా ఓర్పు... సహనం! మరింత సహనం...'' అని అన్నారు.

భగవాన్ శ్రీ రమణులు ఇచ్చిన ఈ బోధ కేవలం సుందరేశ అయ్యర్ గారికే కాక, మనందరికీ కూడా వర్తిస్తుంది!

**గురుపాద సేవకంటె సు**
**ధరలో నజ్ఞాన మడపఁదగు సాధన మెం**
**దరసిన దొరకదు సద్గురు**
**డరుదుగనే దొరకు భాగ్యమదియౌ రమణా.**

- సూరి నాగమ్మ గారు

# Bhagavan's Compassion

(Talk 9)

Dr.K.Subrahmanaian

Bhagavan's compassion for the poor was extraordinary. Once, an old half-blind woman came to see him. Many people were seated in the hall, and Bhagavan himself was reading the newspaper. People saw her torn, dirty sari and did not pay attention to her. Bhagavan turned around, saw her, and called her by her name. He said, "Please come". She went close to look at him since she was half-blind. He continued, "How is the family? How are your sons?" Normally, Bhagavan didn't ask such questions. Because his compassion for the poor was so much, he asked all these questions. She said, "You know Swami, I am not very happy. My children are not doing what they should be doing. I thought I should come and see you because I haven't seen you for a very long time." Bhagavan said, "You wouldn't have come empty-handed; you must have brought something for me." The old woman stood quietly, for she was too shy to give him what she had brought. When Bhagavan insisted, the old woman took out two dosas and gave them to him. Someone sitting very close said, "Bhagavan, I think they are stale dosas. Please don't eat them. They will not agree with you." Bhagavan said, "Is that so? Then I don't want to give these dosas to anyone here because it will upset your stomach. However, I will eat the dosas myself." He ate both the dosas. Normally, he distributed everything, but this time, he didn't.

The compassion that he had for this old woman was such that he ate the two dosas that were considered stale by others. Bhagavan also added, “This woman has brought the dosas out of great affection.” When Bhagavan’s mother passed away, he came down to the foot of the hill to sit before the mother’s *samadhi*. This old woman used to come almost every day. She said Bhagavan should not sit on the ground, and so, with her own hands made a platform out of mud. Bhagavan said, “She was the first person to make a platform for me.” It has been recorded that for one whole hour he talked about the old woman, and what she did for him, and how she looked after him.

This incident reminds us of Kuchela, who went to see his friend, Krishna, who was also a king. Kuchela was reluctant to give what he had brought. But Krishna said, “Your wife would not have sent you empty handed.” Even then, Kuchela did not give the puffed rice he had brought. Instead, Krishna himself put his hand into the little bag, and took out the puffed rice and started eating it.

